క్లుప్తంగా

రైల్వేగేటును ఢీకొట్టిన మినీ ట్రక్

కై కలూరు: కై కలూరు–ఆకివీడు రైలు పట్టాల మధ్య ఆలపాడు రైల్వేగేటును మినీ ట్రక్ మంగళ వారం ఢీకొట్టింది. దీంతో సిగ్నల్ వ్యవస్థ దెబ్బతి నడంతో ఆ సమయంలో వచ్చిన నరసాపురం–విజయవాడ, పూరి–తిరుపతి రైళ్లు గేటు వద్ద కొద్ది సమయం ఆగాయి. గేటుకు మరమ్మతులు చేసేవరకు అర్ధగంట ట్రాఫిక్ ఇరువైపులా స్తంభిం చింది. రైల్వే సిబ్బంది మాట్లాడుతూ సాధారణం గా ఇటువంటి ఘటనలు జరుగుతాయన్నారు. గేటును ఢీకొట్టినప్పుడు సిగ్నల్ వ్యవస్థ దెబ్బతిం టుందన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని చెప్పారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చినపారుపూడి (పెదపారుపూడి): మండలంలోని చినపారుపూడి గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టీ సీతామహాలక్ష్మి మంగళశారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. అన్ని శాఖలా అధికారులు హాజరకావాలని కోరారు.

13న ఉమ్మడి కృష్ణా జిల్లా ఖోఖో సంఘం ఎన్నిక

గుడివాడటౌన్: ఉమ్మడి కృష్ణా జిల్లా ఖోఖో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఈనెల 13వ తేదీన నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి మడక ప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. గన్నవరంలోని రోటరీ ఆడిటోరియంలో తనతోపాటు అసోసియేషన్ అధ్యక్షుడు టీఎస్ఆర్‌కే ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ ఎంపిక జరుగుతుందన్నారు. ఖోఖో అసో సియేషన్ సభ్యులు అనుబంధ క్లబ్‌ల సభ్యులు సీనియర్ క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

శ్మశానవాటిక సమస్యపై నివేదిక కోరిన లోకాయుక్త

తోట్లవల్లూరు: గత అనేక సంవత్సరాలుగా శ్మశానభూమి లేక ఇబ్బంది పడుతున్న కుమ్మమూరు ఎస్సీ ఏరియా సమస్యపై నివేదిక సమర్పించాల్సిందిగా రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుని ఆదేశించినట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం తెలిపారు. ఈ సమస్యపై గత నెల 6వ తేదీన రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదు చేశామని తెలిపారు. గ్రామానికి చెందిన 200 కుటుంబాలకు శ్మశానవాటిక లేక అవస్థలు పడుతున్నారని, పక్కనే ఉన్న డొంకలో మృతదేహాలను ఖననం చేస్తున్నట్లు శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. దీనిపై అక్టోబర్ 3వ తేదీ లోపల నివేదిక అందించాలని రాష్ట్ర లోకాయుక్త లక్ష్మణరెడ్డి కలెక్టర్ రాజాబాబుని ఆదేశించారని ఆయన పేర్కొన్నారు.

ఫార్మేటివ్ అసెస్మెంట్–1 పరీక్షలు ప్రారంభం

మొవ్వ: మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి మధ్య విద్యార్థులకు మంగళవారం నుంచి ఫార్మెటివ్ అసెస్మెంట్–1 పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండలంలోని 59 ప్రభుత్వ పాఠశాలలతో పాటు 11 ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5,540 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు విద్యాశాఖ అధికారి పేర్కొంది. ఈ పరీక్షలను మండల విద్యాశాఖ అధికారిణి–2 కాటూరి శ్రీలక్ష్మి పరిశీలించారు. ఆయా పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. సీఆర్‌పీలు తాతా సమర్పణరావు, సీహెచ్ శ్రీమన్నారాయణ, చీలి నాగరాజు, సీహెచ్ నాగ హిమజ, కంచర్ల ఆంజనేయులు, పంది కృష్ణార్జునులు పరీక్షలకు సహకరించారు.

పాఠశాల తనిఖీ

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలి–1 ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ–2 కే సురేష్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం మెనూ ప్రవేశపెట్టిందన్నారు. దీనిని వంట ఏజెన్సీ నిర్వాహకులు అమలు జరిపేలా ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలలోనే మధ్యాహ్న భోజనాన్ని తినేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు సులభశైలిలో బోధన చేస్తూ ఉత్తమ ఫలితాలు రాబట్టాలన్నారు. రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

5న సర్వసభ్య సమావేశం

మండవల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రా ము) అధ్యక్షతన 5వ తేదీ మధ్యాహ్నం 2 గంటల కు సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీ ఓ సీకె వెంకటరమణ మంగళవారం తెలి పా రు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

శ్రీ కొండలమ్మ ఆలయంలో చండీ హోమం

గుడ్లవల్లేరు: మండల పరిధిలోని వేమవరంలో శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో అధిక శ్రావణ మాస పౌర్ణమి సందర్భంగా మంగళవారం అమ్మవారి సన్నిధిలో చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం వీర వెంకట కృష్ణమూర్తి దంపతులు, సభ్యులు పామర్తి వెంకట స్వామి దంపతులు, కొమ్మన బోయిన రవిశంకర్ దంపతులు, వల్లూరు వెంకటేశ్వరరావు ఈ హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు వివరాలు వెల్లడించారు.

రైతులను ఆదుకోవడమే లక్ష్యం

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- ముంపు పొలాల పరిశీలన


ముంపు పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: ఆపదలో ఉన్న రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని రాపర్ల, జమీదగ్గుమిల్లి, పోలవరం, ఉంగ్రపూడి, ఉరుటూరు గ్రామాల్లో వర్షాలకు ముంపునకుగురైన వరి పొలాలలను ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. అధికారులతో కలిసి అక్కడి విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక మురుగు డ్రెయిన్‌లు సక్రమంగా లేని కారణంగానే వర్షపు నీరు దిగువకు ప్రవహించక పొలాలలోని నిల్వ ఉండిపోవడం జరిగిందని స్థానిక రైతులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరి పంట నష్ట పోవడానికి గల కారణాలను తెలుసుకుని దానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామాల్లో మురుగు డ్రెయిన్‌ల నిర్వహణ సక్రమంగా లేనికారణంగానే ఈ సమస్య వచ్చిందన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు వహించాలని అధికారులకు సూచించారు. రైతులు ఎవ్వరూ అధైర్య పడవద్దని రైతులకు అండగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, మండల కో ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, మండల సచివాలయ కన్వీనర్ ముప్పిడి సురేష్‌రెడ్డి, మండల ఆర్బీకే అధ్యక్షుడు ఏ శ్రీనాథ్‌రెడ్డి, ఉప సర్పంచ్ డి.బాల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, ఎం.సుబ్రమణ్యం, జీ ఆంజనేయరెడ్డి, స్పర్జన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కుంగిన రహదారి పరిశీలన

పామర్రు గ్రామంలోని 9వ వార్డు నల్లగుంట దగ్గరలో నాగులేరు గట్టు కరకట్ట వద్ద కుంగిన రహదారిని ఎమ్మెల్యే మంగ ళవారం పరిశీలించారు. రహదారి కుంగటం వలన రాక పోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, వార్డు మెంబరు తాడిశెట్టి పవన్ కుమార్ ఎమ్మెల్యేకు వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రహదారి కుంగిన ప్రాంతంలో వెంటనే మరమ్మతులు చేయిస్తామన్నారు. స్థానిక నాగులేరు వంతెన వద్ద నుంచి ఉరుటూరు వరకు రహదారి ఏర్పాటుకు త్వరలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని త్వరలో టెండర్లు కేటయించి పనులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆరేపల్లి శ్రీహరి, గ్రామ ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, కాకర్ల శివ, మద్దుల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

తూడు తొలగింపు

పెదపారుపూడి: మండలంలోని పెదపారుపూడివద్ద పాలకోడ్ డ్రెయిన్‌లో గుర్రపుడెక్క, తూడు, ముళ్ల తొలగింపు పనులను ఎంపీపీ గోగం సురేష్ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వర్షాలకు మునిగిన పొలాల పరిశీలించిన ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ గుర్రపుడెక్క, పిచ్చి మొక్కల తొలగించాలని డ్రెయినేజీ ఈఈ విజయలక్ష్మిని ఆదేశించారన్నారు. దీంతో ప్రొక్లెయిన్ పెట్టి డెక్క, తూడు తొలగింపు పనులు నిర్వహిస్తున్నారన్నారు. సుమారు 5 కిలో మీటర్ల వరకు తొలగింపు పనులు చేశారు. జాజుల చిన్నారి పాల్గొన్నారు.

9,057 మందికి సర్టిఫికెట్లు

పమిడిముక్కల: మండలంలోని 17 సచివాలయాల్లో జరిగిన జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా 9057 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ సుధాప్రవీణ్ మంగళవారం తెలిపారు. అగినపర్రులో 234 మందికి, అలీనఖీపాలెంలో 276, చోరగుడిలో 386,గురజాడలో 335, హనుమంతపురంలో 413, ఐనంపూడిలో 662, ఐనపూరులో 788, కపిలేశ్వరపురం–1లో 166, కపిలేశ్వరపురం–2లో 267, కృష్ణాపురంలో 665, లంకపల్లిలో 511, మంటాడలో 1512, మర్రివాడలో 401, మేడూరులో 939, పమిడిముక్కలలో 464, తాడంకిలో 449, వీరంకిలో 589 మందికి సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు.

సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


కైకలూరులో రహదారులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కై కలూరు: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. నియోజకవర్గ నాలుగు మండలాల్లో పలు గ్రామాలను సందర్శించి గ్రామాభివృద్ధిపై ప్రజాప్రతినిధులతో మంగళవారం చర్చించారు. కై కలూరు మండలం రామవరం, దొడ్డిపట్ల, శీతనపల్లి, దానిగూడెం, మండవల్లి మండలం లోకుమూడి, చావలిపాడు, నుచ్చిమిల్లి, కలిదిండి మండలం సున్నంపూడి, గుర్వాయిపాలెం, సంతోషపురం, ముదినేపల్లి మండలం పెరికేగూడెం, పెదపాలపర్రు, కోడూరు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులుతో సమావేశమయ్యారు. ఎస్సీ కాలనీల్లో సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీలు అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, వైస్ ఎంపీపీలు కనకదుర్గా, మహమ్మద్ జహీర్, నాగలక్ష్మి, సర్పంచ్‌లు బత్తిన ఉమామహేశ్వరరావు, చెరుకువాడ బలరామరాజు, చుండ్రూ సరస్వతి, గరికిముక్కు మరియమ్మ, ద్రోణాద్రి నాగలక్ష్మి, దానం మేరీ నవరత్నకుమారి, కరేటి నాగమణి, ఎంపీటీసీ సభ్యులు గోదావరి సత్యనారాయణ, మంగినేని రామకృష్ణ, నంద్యాల ఏడుకొండలు, ఏస్తేరు, నాయకులు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టరు గంటా సంధ్య, మండల పార్టీ అధ్యక్షుడు మోట్రూ ఏసుబాబు, గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు


ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను ఆహ్వానిస్తున్న సీడీపీవోలు భానుశ్రీ, భానుమతి

పామర్రు: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు, టేక్ హోం రేషన్ కార్యక్రమాలు బుధవారం నుంచి ప్రారంభించ నున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్‌ను ఐసీడీఎస్ పామర్రు, మొవ్వ ప్రాజెక్టుల సీడీపీవోలు వీ భానుశ్రీ, భానుమతి ఆహ్వానించారు. మంగళవారం ఎమ్మెల్యేను కలిసి ప్రారంభ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బలవర్ధకమైన పోషక బియ్యం, అనుబంధ పోషకాహారాలను గర్భిణులు, బాలింతల ఇళ్లకు సరఫరా చేస్తామన్నారు. సూపర్‌వైజర్ విజయకుమారి తదితరుల ఉవారి వెంట ఉన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు చేయూత అవసరం


విభిన్న ప్రతిభావంతుడు పెద్దిరాజులు స్వామికి సాయం అందజేస్తున్న సురేష్‌బాబు

కంకిపాడు: విభిన్న ప్రతిభావంతులకు చేయూత అవసరమని లయన్స్ ప్రతినిధి, ధనేకుల ఇన్స్టిట్యూట్ మెకానికల్ విభాగం హెచ్‌ఓడీ రావి సురేష్ బాబు అన్నారు. గుడ్లవల్లేరు మండలం సింగలూరుకు చెందిన విభిన్న ప్రతిభావంతుడు నందం పెద్దిరాజులు స్వామి డిగ్రీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతుండటంతో రూ.2500 నగదు, బ్రెయిలీ పుస్తకాలు, మందులు మంగళవారం అందించారు. ఈడుపుగల్లు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో సురేష్‌బాబు మాట్లాడుతూ పెద్దిరాజులు స్వామికి అవసరమైన వైద్య సేవలు ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రిలో అందిస్తున్నామన్నారు. పోటీ పరీక్షలకు సహకారం అందిస్తామన్నారు. తుమ్మల కిషోర్, రావి రాజేష్, నెరుసు శివకుమార్, గౌతమ్, నితీష్ పాల్గొన్నారు.

మణిపూర్ దాడులకు నిరసనగా శాంతి ర్యాలీ



తోట్లవల్లూరులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

తోట్లవల్లూరు: మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన దాడులకు నిరసనగా తోట్లవెల్లూరులో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యాన మంగళవారం శాంతిర్యాలీ జరిగింది. దాడులకు కారకులైన వారిని కఠినంగా శిక్షించటంతోపాటు శాంతి నెలకొనేలా చూడాలని పలువురు దైవసేవకులు తెలియజేశారు. శాంతిర్యాలీ అనంతరం తహసీల్దార్ కుసుమకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు వల్లూరు చంద్రశేఖర్, నిస్సీటెలివిజన్ డైరెక్టర్ ఇందుపల్లి శేఖర్, పాస్టర్‌లు సాల్మన్, సాల్మన్‌రాజ్, కిషోర్ బాబు, జీవన్, ప్రభుదాస్, తిమోతి, ఏసుదాస్, రాజారత్నం, బుజ్జిబాబు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు సత్కారం


మాట్లాడుతున్న ఎంపీపీ రామిశెట్టి

ముదినేపల్లి రూరల్: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి సూర్యప్రకాష్ సేవలు ఆదర్శం కావాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సూర్యప్రకాష్ ఉద్యోగోన్నతిపై కై కలూరు మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పీ మల్లీశ్వరి ఆధ్వర్యాన కార్యాలయంలో అభినందన సభ మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ సీనియర్ అసిస్టెంట్‌గా మండలంలోని స్థానిక ప్రజాప్రతినిధులందరికీ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేసేందుకు సహకరించారన్నారు. సూర్యప్రకాష్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏవో రమణబాబు, ఈవోపీఆర్డీ విజయసారధి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శీలం రామకృష్ణ, బొర్రా శేషుబాబు, పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్ : ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ప్రతి మంగళవారం స్వామివారికి అభిషేకాలు చేయించేందుకు దూరప్రాంతాల నుంచి అనేకమంది భక్తులు ఆలయానికి చేరుకుంటారు. భక్తులు స్వామివారి పుట్టలో పాలుపోసి దర్శించుకొని అభిషేకాలు చేయించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో 150 మందికి పైగా భక్తులు అభిషేకాలు చేయించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. చైర్మన్ శొంఠి నాగరాజు, సహాయ కమిషనర్ ఎస్.సంధ్య పాలకవర్గ సభ్యులు పర్యవేక్షణ చేశారు.

పరీక్షలను పరిశీలించిన ఎంఈవోలు



పమిడిముక్కల: మండలంలోని కృష్ణాపురం ప్రాథమిక పాఠశాలను ఎంఈవోలు పద్మరాణి, ఎస్.శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఏ–1 పరీక్షలను పరిశీలించారు. పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

గ్రామ సభ



మండవల్లి: మండవల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి మెండా రూన్సి అధ్యక్షతన మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ బి.ఆనందబాబు మాట్లాడుతూ కొత్తగా కుళాయిలు కావలసిన వారు గతంలో గ్రామ పంచాయతీ బోర్డు తీర్మానం చేసిన విధంగా డబ్బులు చెల్లించాలని తెలిపారు. ఓసీ, బీసీలకు రూ.10 వేలు, ఎస్సీ ఎస్టీలకు రూ.7 వేలు వంతున బోర్డు తీర్మానం చేసినట్లు తెలిపారు. ఉప సర్పంచ్ జొన్నలగడ్డ విజయలక్ష్మి, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్ పనుల పరిశీలన



మండవల్లి: మండలంలోని కానుకొల్లు ఎస్సీ ఏరియా రుద్రభూమిలో జంగిల్ క్లియరెన్స్ ప ను లను సర్పంచి నాగదాసి థామస్ మంగళవారం పరిశీలించారు. పిచ్చి మొక్కలు తదితర చెత్తాచెదారులను తొలగించి శుభ్రం చేయించా రు. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ రు ద్రభూమి పరిశుభ్రంగా ఉండే విధంగా చర్య లు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యదర్శి రత్నకుమారి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ రాక

కై కలూరు: మహిళా శిశు సంక్షేమశాఖ, ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో కైకలూరు సీఎన్నార్ గార్డెన్‌లో వైఎస్సార్ సంపూర్ణపోషణ–టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)తో కలిసి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ బుధవారం ప్రారంభిస్తారు. ఈ మేరకు ఐసీడీఎస్ కై కలూరు ప్రాజెక్టు సీడీపీవో ఆనంద్ మంగళవారం చెప్పారు. ఉదయం 11 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం ఏలూరు జిల్లా వ్యాప్తంగా పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టరు ప్రారంభిస్తారని తెలిపారు.

ఏఎంటీ సేవలు ప్రారంభం


సేవలను ప్రారంభిస్తున్న మేనేజర్ గోపీనాథ్

కూచిపూడి(మొవ్వ): కంప్యూటర్ బేస్డ్ ఆటోమెషిన్ టెస్ట్ (ఏఎంటీ) విధానాన్ని మొవ్వ మండలం కూచిపూడి గ్రామంలోని పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సహాయక సంఘంలో మంళవారం పామర్రు పాలశీతల కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపీనాథ్ ప్రారంభించారు. పాలలో వెన్న శాతాన్ని ఈ కంప్యూటర్ ద్వారా ప్రింటు తీసి రైతులకు ఇస్తారు. సుమారు రూ.70 వేలతో కూచిపూడి పాల సేకరణ కేంద్రాన్ని కంప్యూటరీకరణ చేసినట్లు మేనేజర్ వెల్లడించారు. కృష్ణ మిల్క్ యూనియన్ పాడి రైతులకు అండగా ఉంటుందని, అత్యధిక పాల రేటు అందించేది కృష్ణ మిల్క్ యూనియన్ అని ఈ సందర్భంగా రైతులకు వివరించారు. కృష్ణ మిల్క్ యూనియన్ ద్వారా అందుతున్న సదుపాయాలను, సేవలను తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రం అధ్యక్షురాలు పైడిపాముల మనోహరం, సూపర్వైజర్ కైలా రమేష్, వేతన కార్యదర్శి మహంకాళి సత్య శ్రీనివాస్, టెస్టర్ లంకపల్లి సుబ్రమణ్యం, పాడి రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతుల్లో పసుపు పండించాలి

జిల్లా ఉద్యానశాఖ అధికారి జ్యోతి


మామిళ్లపల్లిలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి


పమిడిముక్కల: సేంద్రియ పద్ధతుల్లో పసుపు సాగు చేయాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి జ్యోతి రైతులకు సూచించారు. అగినపర్రు గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు పొలంబడి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి మాట్లాడుతూ పసుపు కొమ్ములు నాటేటప్పుడు రైజోమ్‌కు రైజోమ్ మధ్య దూరం 15 సెంటీమీటర్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ఇలా చేయడం వలన మొక్క కావల్సిన ఆహారాన్ని తీసుకొని రైజోమ్ ఉత్పత్తికి తోడ్పడుతుందన్నారు. రైజోమ్ నాటే ముందు, పెరుగుతున్న దశలో వేపపొడర్‌ను వేస్తే పురుగుల బారి నుంచి తప్పించుకోవచ్చన్నారు. రైజోమ్‌ను చిన్న చిన్న పిలకలుగా కత్తిరించి నాటుకోవడం ద్వారా తక్కువ మోతాదులో విత్తనం సరిపోతుందన్నారు. డీఆర్సీ ఏడీఏ శ్రీనివాస్ వరిలో కలుపు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఏఓ గణేష్‌రెడ్డి మాట్లాడుతూ ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడితే 50 శాతం రాయితీపై డ్రోన్లు పొందవచ్చన్నారు. ఉద్యాన అధికారి నాగదేవిశ్రీ, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు


సాక్షి ఎఫెక్ట్

కైకలూరు: ఎగువ నుంచి చేరుతున్న వరద నీటితో పాటు భారీగా గుర్రపుడెక్క మండవల్లి మండలం పెదఎడ్లగాడి వంతెన వద్ద పేరుకుపోయింది. దీంతో దిగువన లోతట్టు ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. ఈ సమస్యపై గుర్రపుడెక్కతో గుబులు శీర్షికతో సాక్షిలో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన కైకలూరు డ్రెయినేజీ జేఈఈ ఇందిర పెదఎడ్లగాడి వంతెన వద్ద గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు మంగళవారం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ఈ పనులకు రూ.8.50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. యంత్రాలతో తొలగించడం కష్టతరంగా ఉందన్నారు. ఎక్కువ మంది కూలీలతో డెక్కను తొలగిస్తున్నామని చెప్పారు.

సుబ్బారాయుడి ఆలయానికి విరాళం



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి దాత మంగళవారం విరాళం అందించారు. గుడివాడకు చెందిన అడబాల నాగప్రసాద్, శృతి దంపతుల కుమార్తె షిరీన్ అంతరాలయ ముఖద్వారానికి వెండి తాపడం నిమిత్తం రూ.25 వేలు విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని షిరీన్ కుటుంబ సభ్యులు స్వామిసన్నిధిలో ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మకు అందజేయగా చైర్మన్ శొంఠి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య పాల్గొన్నారు.

నాగరాజుకోడు వరద ఉధృతి పర్యవేక్షణ



కై కలూరు: వర్షాల కారణంగా ఆటపాక పక్షుల కేంద్రం గట్టు నుంచి ఏలూరు రూరల్ మండలం కోమటిలంక వెళ్లే రహదారిలో నాగరాజుకోడు వద్ద వరద ఉధృతిని కై కలూరు డెప్యూటీ తహసీల్దారు ఇబ్రహీం, కైకలూరు అగ్నిమాపకాధికారి క్రాంతికుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ ఏలూరు కలెక్టరు ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో ఏపీఎస్డీఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేశారన్నారు. ఫైర్‌శాఖ నుంచి బోటును వీరికి అందించామన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

మెరుగైన వైద్యం అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోగం సురేష్ తదితరులు

వెంట్రప్రగడ(పెదపారుపూడి): పీహెచ్‌సీ అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ పీహెచ్‌సీలో మంగళవారం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీలో చేయాల్సిన అభివృద్ధి పనులు వివరాల అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పీహెచ్‌సీలో పాము, కుక్కకాటుకు మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై గ్రామాలకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు సందీప్, కమిటీ సభ్యులు అప్పికట్ల అశాజ్యోతి, జూపల్లి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com